



నామినేషన్ల కోలాహలం

జిల్లాలో ఎంపీకి నలుగురు.. ఎమ్మెల్యేలకు 21 మంది

భీమవరం టౌన్/తణుకు/ఉండి/ఆచంట/పాలకొల్లు టౌన్/నరసాపురం టౌన్/భీమవరం రూరల్/తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 19 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండో రోజు శుక్రవారం జిల్లాలో భారీగా నామినేషన్లు పడ్డాయి. నరసాపురం ఎంపీ స్థానానికి నలుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా కలెక్టర్, పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుమిత్‌కుమార్ తెలిపారు. వైసీపీ తరపున గూడూరి ఉమాబాల రెండు సెట్లు, గూడూరి జగదీష్ ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థి గోటేటి లక్ష్మీనరసింహారావు రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థి ఉందుర్తి ప్రసన్నకుమార్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లో ఐదుగురు అభ్యర్థులు ఏడు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారన్నారు. డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, కలెక్టరేట్ ఏవో పి.పాపారావు, ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

'వచ్చే ఇరవై రోజులు చాలా కీలకం. ప్రతి కార్యకర్త ప్రతి వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించాలి' అని తణుకు టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. నామినేషన్ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'నామినేషన్‌కు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు. ఇక్కడకు వచ్చిన జన సందోహం చూస్తే విజయం ఖాయమైంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. గ్రామాల్లోను, వార్డుల్లోను ప్రతి ఇంటిని సందర్శించాలి. వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలి. భవిష్యత్‌లో కూటమి ప్రభుత్వం ద్వారానే ప్రజలకు న్యాయం జరుగుతుంది. ఇందు కోసమే చంద్రబాబు, పవన్, మోదీ కలిసి కూటమిగా ఏర్పడ్డారు. ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించాలి' అని కోరారు.

కూటమి విజయం తథ్యం : ఆరిమిల్లి



అసెంబ్లీ స్థానాల్లో నామినేషన్లు

తణుకు అసెంబ్లీ నియోజకవర్గానికి నలుగురు అభ్యర్థులు 12 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో బీవీ రమణ తెలిపారు. టీడీపీ తరపున ఆరిమిల్లి రాధాకృష్ణ నాలుగు సెట్లు, ఆయన సతీమణి కృష్ణతులసి నాలుగు సెట్లు, వైసీపీ తరపున మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రెండు సెట్లు, ఆయన సతీమణి లక్ష్మీకిరణ్ రెండు సెట్లు సమర్పించారు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండో రోజు నలుగురు అభ్యర్థులు ఎనిమిది సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో సీపీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. కాంగ్రెస్ నుంచి వేగేశ్న గోపాలకృష్ణంరాజు మూడు సెట్లు, టీడీపీ నుంచి నరసాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణంరాజు తరపున ఆయన సతీమణి రమాదేవి ఒకటి, వైసీపీ నుంచి డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు రెండు, ఆయన సోదరుడు పీవీఎస్ గోపాలకృష్ణంరాజు రెండు సెట్లు సమర్పించారు. పాలకొల్లులో నలుగురు అభ్యర్థులు ఎనిమిది సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివన్నారాయణరెడ్డి తెలిపారు. టీడీపీ నుంచి ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు రెండు సెట్లు, ఆయన సతీమణి రెండు సెట్లు, కాంగ్రెస్ అభ్యర్థి కొలుకులూరి అర్జునరావు రెండు సెట్లు, కొలుకులూరి నాగ భాస్కరరావు రెండు సెట్లు దాఖలు చేసినట్లు చెప్పారు. ఆచంటలో శుక్రవారం నలుగురు అభ్యర్థులు ఎనిమిది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు తెలిపారు. టీడీపీ నుంచి పితాని సత్యనారాయణ మూడు, ఆయన తనయుడు వెంకటసురేష్ ఒకటి, వైసీపీ నుంచి చెరుకువాడ శ్రీరంగనాథ రాజు రెండు, ఆయన తనయుడు నరసింహరాజు రెండు సెట్ల నామినేషన్లను సమర్పించారు. నరసాపురంలో ఇద్దరు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ అంబరీష్ తెలిపారు. వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు మూడు సెట్లు, ఆయన భార్య శారదావాణి మూడు సెట్లు సమర్పించారు.


పాలకొల్లు ఆర్వో శివన్నారాయణరెడ్డికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కూటమి అభ్యర్థి నిమ్మల, చిత్రంలో అంగర తదితరులు


ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా రఘురామ పేరిట ఆయన సతీమణి రమాదేవి నామినేషన్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు

ఉండి ఎమ్మెల్యేగా పోటీ చేస్తా : ఎంపీ రఘురామ

భీమవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆ దిశగా నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నట్టు ఆయన ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి వివరించారు. తనకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే శివరామరాజులను స్వయంగా కలిసి మద్దతు కోరతానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగనుండడంతో పలువురు నాయకులు, కార్యకర్తలు రఘురామకృష్ణంరాజును మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

భీమవరంలో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరాజు తెలిపారు. తాడేపల్లిగూడెంలో ఇద్దరు అభ్యర్థులు రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.చెన్నయ్య తెలిపారు. జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, స్వతంత్ర్య అభ్యర్థి దేవతి పద్మావతి నామినేషన్ పత్రాలు సమర్పించారు.

నామినేషన్ కౌంటర్ — 2వ రోజు

ఎంపీ/ఎమ్మెల్యే నియోజకర్గాలు	రెండో రోజు నామినేషన్లు	మొత్తం
నరసాపురం ఎంపీ	04	05
1.ఆచంట	04	04
2.పాలకొల్లు	04	04
3.నరసాపురం	02	02
4.భీమవరం	01	01
5.ఉండి	04	04
6.తణుకు	04	04
7.తాడేపల్లిగూడెం	02	02
మొత్తం	21	21
ఏలూరు ఎంపీ	02	03
1.ఉంగుటూరు	01	01
2.దెందులూరు	01	02
3.ఏలూరు	00	01
4.పోలవరం	00	02
5.చింతలపూడి	00	00
6.నూజివీడు	01	03
7.కైకలూరు	03	03
మొత్తం	06	12

చంద్రబాబుతో నేడు రామరాజు భేటీ

భీమవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):టీడీపీ అధినేత చంద్రబాబుతో ఉండి ఎమ్మెల్యే రామరాజు శనివారం భేటీ కానున్నారు. ఉండి కూటమి అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజుకు ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడంతో ఎమ్మెల్యేకు పిలుపు వచ్చింది. కూటమి అభ్యర్థి విషయమై శనివారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. దీంతో మధ్యాహ్నం 3.30 గంటలకు చంద్రబాబుతో రామరాజు సమావేశం కానున్నారు. అధినేతను కలిసిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుందామంటూ కార్యకర్తలకు రామరాజు స్పష్టం చేశారు.


తణుకులో భారీ ర్యాలీగా వచ్చి.. ఆర్వో బీవీ రమణకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కూటమి అభ్యర్థి ఆరిమిల్లి


తాడేపల్లిగూడెంలో ఆర్వో చెన్నయ్యకు నామినేషన్ పత్రాలు ఇస్తున్న కూటమి అభ్యర్థి బొలిశెట్టి, చిత్రంలో వలవల, బాపిరాజు..


ఆచంటలో ఆర్వో నాయుడుకు నామినేషన్ పత్రాలు ఇస్తున్న కూటమి అభ్యర్థి పితాని, చిత్రంలో తోట, వర్మ



ఉంగుటూరులో నామినేషన్ దాఖలు చేస్తున్న కూటమి అభ్యర్థి ధర్మరాజు

హత్య కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 19 : మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని ఒక వ్యక్తిపై ఇద్దరు నాపరాయితో దాడి చేసి కొట్టి హత్య చేసినట్టు నేరం రుజువుకావడంతో వారిద్దరికి పదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరులోని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తమకుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఏలూరు తంగెళ్ళమూడి మసీదు ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్దుల్ అజీమ్ పిప్పిపళ్ళ వైద్యం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. 2017 మే 8వ తేదీ మధ్యాహ్నం సయ్యద్ అబ్దుల్ అజీమ్ తన ఇంటికి వెళ్తుండగా తంగెళ్ళమూడిలోని తన ఇంటికి వెళ్లే దారిలో అదే ప్రాంతానికి చెందిన సియ్యాల రంగా, రెడ్డి నాగరాజు అడ్డగించి మద్యానికి డబ్బులు ఇవ్వాలని అడిగారు. అజీమ్ డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో పక్కనే డ్రెయిన్‌పై ఉన్న నాపరాయి తీసుకుని అతన్ని కొట్టి డ్రెయిన్‌లో పడవేశారు. సమాచారం అందుకున్న అతని కుమార్తె షేక్ రసీమున్నీసా వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఏలూరు టూ టౌన్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ బంగార్రాజు కేసు నమోదు చేయగా తర్వాత సీఐ మధుబాబు కేసు దర్యాప్తు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరు జిల్లా కోర్టులో విచారణ సాగింది. నిందితులైన రంగా, నాగరాజులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి పదేళ్ల జైలు, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తమకుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొనేరు సీతారామ్‌రావ్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు టూ టౌన్ సీఐ ఎం.ప్రభాకర్, ఎస్ఐలు సాధిక్, మదీనా బాషా, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, కోర్టు కానిస్టేబుల్ చిరంజీవి సహకరించారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ప్రత్యేక దృష్టి సారించి కోర్టుల్లో పెండింగ్‌లోవున్న ట్రైల్ కేసులలో త్వరితగతిన, సకాలంలో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టడం, బాధితులకు సత్వర న్యాయం అందించడానికి చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా ఈ కేసులో నిందితులకు శిక్షలు పడేలా కోర్టు మానిటరింగ్ సెల్ విధులు నిర్వర్తించింది. దీంతో వారందరినీ ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు.

మైక్రో అబ్జర్వర్లే కీలకం : కలెక్టర్

భీమవరం టౌన్, ఏప్రిల్ 19 : ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు మైక్రో అబ్జర్వర్లే కీలకమని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆనంద ఇన్ సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన వారికి దిశా నిర్దేశం చేశారు. పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు మైక్రో అబ్జర్వర్ పోలింగ్ స్టేషన్‌లో ఉండాలి. పోలింగ్ స్టేషన్‌లో మౌలిక వసతులను తనిఖీ చేయాలి. ఈసీఐ నిబంధనల ప్రకారం మాక్ పోల్‌ను నిర్వహించాలి. పోలింగ్ సందర్భంలో పోలింగ్ ఏజెంట్లు ఫిర్యాదు చేస్తే వాటిని గోప్యంగా ఉంచి తగిన చర్యలు తీసుకోవాలి. ఓటరుగా నమోదు కావడం ఎంత ముఖ్యమో ఓటును వినియోగించడం అంతే ముఖ్యం. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలి' అని కలెక్టర్ కోరారు. ఓటు ఏ ప్రాంతంలో ఉన్నా సంబంధిత ఫారంను పూరించి ఓటు హక్కును పొందాలని స్పష్టం చేశారు.

ఐదేళ్లూ అణచివేతే





ప్రశ్నిస్తే వేధింపులు.. ఆపై పోలీసు కేసులు

'ప్రజాస్వామ్యంలో పోలీసులను ఎంత ఎక్కువ వాడుకుంటే అంత వేగంగా ఆ ప్రభుత్వం పతనమవుతుంది' అని రాజనీతి శాస్త్రజ్ఞులు చెబుతారు. ఇది పచ్చి నిజం. వైసీపీ ప్రభుత్వంలో అదే జరుగుతుంది అంటూ జిల్లాలోని ఓ పోలీసు అధికారి చెప్పిన వాస్తవాన్ని నేను రైతుగా చెబుతున్నా. కొన్నేళ్లుగా పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు, సంచులు తెచ్చుకునేందుకు చుక్కలు చూశాం. గతంలో మిల్లులకు ఎప్పుడు వెళితే అప్పుడు సంచులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆర్బీకేలకు వెళ్లాలి. అక్కడ సంచులు ఉంటాయన్న గ్యారంటీ లేదు. పండించిన పంట అమ్ముకోవడానికి ఇన్ని తిప్పలా ? మా ఎమ్మెల్యేను నెగ్గించుకున్నాం. ఇప్పటి వరకు మేం ఉన్నామో... చచ్చామో అతనికి తెలియదు. ఎన్నికలు వస్తున్నాయని మళ్లీ గ్రామానికి వస్తున్నాడు. ఏం చెబుతాం. ఈ ప్రభుత్వంలో స్వతంత్రంగా బతికే పరిస్థితి లేకపోయింది.

ఇదీ గణపవరం మండలం చిలకంపాడులోని ఓ రైతు ఆవేదన

(తాడేపల్లిగూడెం-ఆంధ్రజ్యోతి)

అడిగితే అణచివేతలు.. ప్రశ్నిస్తే కేసులు.. విధానాలపై విమర్శిస్తే బెదిరింపులు.. రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనా కాలంలో మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. నిరంకుశత్వంలో కొట్టుమిట్టాడుతున్నామా అంటూ సామాన్యుడి నుంచి మేధావుల వరకు అందరిలోనూ ఒకటే సందేహం. ఎన్నికల వేళ ముద్దులు.. తల నిమురుతూ అలింగనాలు చేసుకుంటూ వుంటే అబ్బో.. మంచివాడు మా అబ్బాయి అని అంతా అనుకున్నారు. ఆ తర్వాతే తెలిసింది అసలు తత్వం.

సీపీఎస్ ఉద్యమంపై ఉక్కుపాదం

అధికారంలోకి రాగానే వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ తీసుకుని వస్తామంటూ ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ ఉద్యోగులు డిమాండ్ చేస్తూనే వచ్చారు. ఏళ్ల గడుస్తున్నా దీనిపై జగన్ సర్కార్ స్పష్టత ఇవ్వకపోవడంతో ఉద్యోగులు జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. వీటిని పోలీసులతో భగ్నం చేయడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. ఉద్యోగ సంఘ నాయకులపై కేసులు పెట్టారు. ఛలో విజయవాడ వెళ్లకుండా బస్ స్టేషన్‌లు, రైల్వేస్టేషన్‌లు, ప్రధాన సెంటర్లలో పోలీసులు గస్తీ కాశారు. చివరకు సీపీఎస్ అమలు చేయలేదు. ఉద్యోగుల కనీస హక్కులను కాలరాశారు. సరెండర్ లీవులను అమలు చేయలేదు. పీఎఫ్ సొమ్ములు ఇవ్వకుండా ప్రభుత్వం ముప్పు తిప్పలు పెట్టింది. ఇప్పటికీ ఆ కేసులు ఉన్నాయి.


ఛలో విజయవాడ వెళ్లనివ్వకుండా రైల్వే స్టేషన్‌లో ఉద్యోగులను అడ్డుకుంటున్న పోలీసులు (ఫైల్)

మహిళలని చూడకుండా..

అంగన్‌వాడీ కార్యకర్తలదీ అదే దుస్థితి. కనీస వేతనం పెంచాలని, అదీ ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీని అమలుచేయాలని మాత్రమే అడిగారు. జీతం సకాలంలో ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలను చెల్లించాలని విన్నవించారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో చివరకు మూకుమ్మడిగా ఉద్యమబాట పట్టారు. దీనిని జగన్ సహించలేకపోయారు. ఆందోళన విరమించకుంటే ఉద్యోగాలను తొలగిస్తూ ఆదేశాలు జారీచేసింది. విధుల్లోకి చేరని వారికి తొలగింపు నోటీసులను అందజేసింది. బలవంతంగా ఉద్యమాన్ని అణగదొక్కింది. అంగన్‌వాడీలు విజయవాడ వెళ్లకుండా పోలీసులే రంగంలోకి దిగారు. జిల్లాలోని ప్రతి పట్టణం, ప్రతి గ్రామంలో అంగన్‌వాడీలను అరెస్టు చేసి చుక్కలు చూపించారు.


యువగళం పాదయాత్రలో వలంటీర్లపై పోలీసుల లాఠీచార్జి (ఫైల్)

యువగళం పాదయాత్రపై ఉక్కుపాదం

గత ఏడాది సెప్టెంబరు 6వ తేదీన నారా లోకేశ్ యువగళం పాదయాత్ర భీమవరం చేరుకుంది. ఆ సమయంలో పాదయాత్రపై స్థానిక వైసీపీ కార్యకర్తలు రాళ్ల రువ్వారు. దీంతో వారికి, యువగళం వలంటీర్ల మధ్య ఘర్షణ జరిగింది. టీడీపీ నాయకులకు, పోలీసులకు గాయాలయ్యాయి. పోలీసులు మాత్రం వలంటీర్లు, టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేశారు. ఘటనా స్థలంలో లేని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మరో 12 మంది నాయకులపై కేసు లు పెట్టారు. యువగళంలో పాల్గొన్న 39 వలంటీర్లను వాహనాల్లో ఎత్తుకుపోయి రోజంతా ఉత్కంఠ కొనసాగించారు. ఎక్కడికి తీసుకెళ్లారో తెలియనివ్వకుండా భయభ్రాంతులు సృష్టించారు. చివరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ముందుస్తు బెయిల్ వచ్చేంత వరకు తెలుగుదేశం నాయకులు అజ్ఞాతవాసంలో ఉన్నారు. అంతకుముందు ఉంగుటూరు నియోజకవర్గంలోనూ వలంటీర్లపై పోలీసులు ప్రతాపం చూపి పలువురిని అరెస్ట్ చేశారు.

• నేతలపై కేసులకు లెక్కే లేదు

నర్సాపురంలో స్థానిక అవసరాల కోసం ఆందోళనలు, ఉద్యమాలు చేపట్టారంటూ ప్రతిపక్ష నాయకులపై అనేక కేసులు పెట్టారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడుపై 19, టీడీపీ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు, జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌పై చెరో ఏడు నమోదయ్యాయి. తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జిపై ఏకంగా 15 కేసులు పెట్టారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ తాడేపల్లిగూడెంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేస్తే అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. బాబ్జిని ముందస్తుగా అదుపులోకి తీసుకోవడానికి పోలీసు బలగాలు వెంటాడాయి. ఇరువర్గాల మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడింది. పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులపై కేసులు నమోదుచేశారు. పండుగ రోజుల్లో జనసేన ఇన్‌ఛార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ నివాసంలో అర్ధరాత్రి పూట సెర్చ్ వారెంట్ లేకుండానే తనిఖీలు చేసి భయభ్రాంతులకు గురిచేశారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుపై అనేక కేసులు పెట్టేశారు. ఇలా రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి ప్రతి నియోజకవర్గంలోనూ వైసీపీ ప్రభుత్వం పోలీసులను ప్రయోగించింది. ఎన్నడూ లేని విధంగా పోలీసులను ప్రయోగించి ప్రతిపక్షాలను అణచివేసేందుకు జగన్ సర్కార్ చేయని ప్రయత్నం లేదు. జిల్లాలో పోలీసులు శాంతి భద్రతలకంటే ప్రతిపక్ష నాయకులు, ఉద్యోగుల కదలికలపై నిఘా వేసేందుకే అత్యధిక సమయాన్ని వెచ్చించారు. సోషల్ మీడియా వేదికగా అధికార పార్టీ నాయకులను పరోక్షంగా విమర్శించినా, ప్రశ్నించినా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఐదేళ్లలో ప్రభుత్వంపై మాట్లాడేందుకు భయపడే పరిస్థితి కల్పించింది.

రైతులనూ వదల్లేదు

ధాన్యం సకాలంలో కొనుగోలు చేయాలంటూ రైతులు రోడ్డెక్కితే కేసులు నమోదు చేసిన ఘనత ప్రభుత్వం మూటగట్టుకుంది. రైతుల ధర్నాలో అండగా నిలిచిన రాజకీయ నాయకులపై కేసులు పెట్టారు. పెంటపాడు మండలంలోనే ఇది చోటు చేసుకుంది. రైతుల ఆందోళనకు మద్దతు తెలిపారంటూ అలంపురం సర్పంచ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జి తదితరులపై కేసులు పెట్టారు. రైతుల నోరు మూయించే ప్రయత్నం చేశారు.



నామవరంలో మాట్లాడుతున్న అప్పటి సీఎం చంద్రబాబు (ఫైల్)

చింతలపూడి నుంచే ఉమ్మడి అటవీ యాజమాన్య పథకం

రాష్ట్రంలో అడవుల సంరక్షణ, చెట్ల పెంపకంలో పేదలను సభ్యులుగా చేసే ఉమ్మడి అటవీ యాజమాన్య పథకాన్ని 1992లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చింతలపూడి నియోజకవర్గం నామవరం వద్ద బర్రికొండ ఫారెస్ట్‌లో ప్రారంభించారు. రాష్ట్రంలో అడవుల సంరక్షణ, సంపద పెంచడానికి ఈ ఉమ్మడి యాజమాన్య పథకాన్ని తీసుకువచ్చి వన చంద్రోదయం పేరుతో ఒక పైలాన్ ఆవిష్కరించారు. ఈ పథకం వన సంరక్షణ పథకం పేరుతో రాష్ట్రమంతటా కొనసాగుతూనే ఉంది. ఇందులో వేలాది మంది పేదలు సభ్యులుగా, అటవీశాఖ సంయుక్తంగా అడవులను పెంచి ఆ సంపదను ఉమ్మడిగా అనుభవిస్తారు.

- చింతలపూడి





జగన్మాయ

తాగునీరు ఇస్తామన్నారు | భీమవరం | రహదారి నిర్మిస్తామన్నారు

మాట తప్పారు

భీమవరం నియోజకవర్గంలో తీర గ్రామాలు, వీరవాసరం మండలంలో పలు గ్రామాల దప్పిక తీరుస్తామని హామీలు గుప్పించారు. యనమదుర్రు డ్రెయిన్‌పై కోట్ల రూపాయలతో నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మిస్తామని గొప్పలు చెప్పారు. చూస్తుండగానే ఐదేళ్లు గడిచిపోయాయి. ఏ హామీ నెరవేరలేదు. డ్రెయినేజీల మురుగు, గ్రామాల్లో చెత్త సమస్యల కూడా పరిష్కారం కాలేదు. హామీలు నెరవేర్చని పాలకులు మరోసారి ఓటర్ల ముందుకు వస్తున్నారు.

- తీరంలో తాగునీటి తిప్పలు
- యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనకు మోక్షం లేదు
- గ్రామాల్లో చెత్త సమస్య

(భీమవరం రూరల్, వీరవాసరం)

చేసిన పనులు లేకపోయినా ప్రభుత్వం అభివృద్ధిపై గొప్పలు చెబుతోంది. ఎంతో చేసేశామని ప్రజా ప్రతినిధుల హడావుడి.. తీరా నియోజకవర్గంలో తీర ప్రాంతం దాహంతో అలమటిస్తూ కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. స్వచ్ఛమైన తాగునీరందిస్తామన్న పాలకులు పత్తా లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హామీలు ఏమయ్యాయి. ఎన్నాళ్లీ తాగునీటి తిప్పలు అంటూ వాపోతున్నారు. వీరవాసరం మండల కేంద్రంలో సుమారు 20 వేల మంది జనాభా. గ్రామంలో నికి ప్రధాన సమస్య డ్రెయినేజీ. చెరువులు ఉన్నప్పటికీ సరైన తాగునీరు లేదు. దీనికితోడు గ్రామంలో టన్నుల కొద్దీ చెత్తా చెదారాన్ని వేయటానికి డంపింగ్ చేయటానికి స్థలం లేక రహదారి మార్జిన్‌వే వేసి పొగపెడుతున్నారు. గొంతేరు డ్రెయిన్ చేర్చి ఉన్న సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకొని సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇది ప్రధాన రహదారికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో చెత్త సేకరణ వాహనాలు అక్కడికి వెళ్లడం లేదు. చెత్తను జాతీయ రహదారి పక్కన గొంతేరు డ్రెయిన్ సమీపంలో ఉన్న సుమారు 45 సెంట్ల ప్రభుత్వ స్థలంలో వేస్తున్నారు.

మండలంలో లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రాల లక్ష్యం నీరుగారింది. 23 గ్రామాలకు 18 గ్రామాలలో సంపద కేంద్రాలు ఏర్పాటయ్యాయి. లక్షల నిధులు నిరుపయోగం కాగా మత్స్యపురిలో సంపద కేంద్రం సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణానికి సిటింగ్ రూంగా మారింది.

వీరవాసరం మండలం రాయకుదురులో తాగునీటి చెరువు ఆధునీకరణ, పంట కాలువ నుంచి చెరువు వరకూ ప్రత్యేక పైపులైన్‌కు రూ.40లక్షల అంచనా రూపొందించారు. ఐదేళ్లు గడిచి పోయాయి. తాగునీటి చెరువు వృథా చెరువే.

తీరం గొంతెండుతోంది

భీమవరం మండలంలో తీరప్రాంత గ్రామాలైన లోసరి, దొంగపిండి, కొత్తపూసలమర్రు గ్రామాల్లో కలుషిత నీరే దిక్కు. ఆ నీరు తాగలేక ప్రైవేటు ప్లాంట్ల నుంచి నీరు కొనుగోలు చేసుకుంటున్నారు. లోసరి మెయిన్ కాలువ చెత్త తొలగింపు పనులు చేపట్టకపోవడం.. నీరు దిగువకు చేరలేని పరిస్థితి నెలకొంది. దీంతో లోసరి, దొంగపిండి, కొత్తపూసలమర్రు, గ్రామ మంచి నీటి పథకాలు చెరువులు నింపాలంటే కష్టసాధ్యంగా మారింది. దానికితోడు ఫిల్టర్ బెడ్‌ల మరమతులకు నిధులు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. స్వచ్ఛమైన నీరు రాకవడం లేదు. ఇదంతా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు వైఫల్యమేనని ప్రాంత ప్రజలు అంటున్నారు.

చెరువులున్నా.. సమస్యే..

వీరవాసరంలో తూర్పుచెరువు, ఎల్లమ్మ చెరువు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పేరుతో పీర్లకోడు చెరువులు ఉన్నాయి. వీటి ద్వారా రెండు రక్షిత నీటి సరఫరా పథకాలు పనిచేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామం అంతటికీ తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీరు కొన్ని ప్రాంతాలకు శుద్ధి చేసే నీరు అందగా మరికొన్ని ప్రాంతాలకు మురుగు నీరే సరఫరా అవుతుంది. తాగునీటి కోసం ప్రజలు ప్రైవేట్ వాటర్ ప్లాంట్లపై ఆధారపడుతున్నారు. పంచాయతీ పరిధిలో నాంది ఫౌండేషన్ ద్వారా తూర్పుచెరువు వద్ద ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ ప్రైవేట్‌కే అప్పగించారు. చినదళితపేటలో రావివారి చెరువు వద్ద సుజల పేరుతో 20 లీటర్ల నీరు తక్కువ దరకే సరఫరా చేసేలా పీతల హిట్లర్ ఫౌండేషన్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. దీనిని ఎప్పుడో మూతవేశారు. గ్రామంలో ఎక్కడికక్కడ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటుచేసి నిటి విక్రయాలు చేస్తున్నారు. పంచాయతీ పరంగా మాత్రం తాగునీరు సమస్యగానే మిగిలింది. ప్రతి నిత్యం ఏడులక్షల లీటర్ల నీరు నీటి సరఫరా పథకాల ద్వారా పంపిణీ అవుతున్న గ్రామస్తుల దాహార్తి తీరడం లేదు.

రాయకుదురు మంచినీటి చెరువుగట్టుపై 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ఎస్ఆర్ ఫిల్టర్ బెడ్లు ఉండేవి. మావుళ్లమ్మ ఆలయం సమీపంలో మరో ఓహెచ్ఎస్ఆర్ నిర్మించి బోర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. చెరువుగట్టుపై ఒహెచ్ఎస్ఆర్ ఫిల్టర్‌బెడ్‌లను తొలగించారు. ఫిల్టర్‌బెడ్ లోని నీరు శుద్ధి కాకపోవడంతో బోరు నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. సమీపంలో రొయ్యల సాగుతో చెరువు నీరు కలుషితమవుతోంది.

మాట ఇచ్చారు.. ఫలితం లేదు

మాట ఇచ్చారు కానీ ఫలితం లేదు. అంచనా వేయాలన్నారు.. నిధులు వచ్చాయన్నారు.. టెండర్ వేసిన ఎవరూ రాలేదంటున్నారు.. యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్ రోడ్డు పరిస్థితి ఇది. రహదారిని నిర్మాణానికి ఐదేళ్ల క్రితం ఇచ్చిన హామీ గాలికొదిలేశారు. ఇప్పటికి రహదారులు ఏర్పాటు లేకపోవడం వంతెనలు నిరుపయోగంగా ఉన్నాయి. అప్పట్లో యనమదుర్రు డ్రెయిన్‌పై తోకతిప్ప, గొల్లవానితిప్ప, పట్టణ పరిధిలోను మూడు చోట్ల ఒక్కో వంతెన రూ.4.5 కోట్లుతో నిర్మాణం చేపట్టారు. దాదాపు ఆరేళ్లు దాటుతున్నా వంతెనలకు ఇరువైపులా రహదారులు లేవు. రెండు వంతెనలకు గ్రామస్తులే ర్యాంపులు వేసుకుని నడవడం రెండు చక్రాల వాహన ప్రయాణం సాగిస్తున్నారు. ఒక వంతెన శిథిలావస్థకు చేరిన వంతెనలా మారింది. ఈ ప్రభుత్వం హాయంలో ఇరువైపులా రహదారులకు రూ.36 కోట్లు మంజూరు చేసింది. అలా వచ్చి ఏడాది అయిన టెండర్లు పిలవడం ఎవరూ ముందుకు రాలేదనడంతో పనులు ప్రారంభంకాని వంతెనలుగా మారాయి. ఇదంతా ప్రభుత్వం లోపమేనని నిర్వాసితులు నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

సీసీ డ్రెయిన్లు..?

వీరవాసరంలో డ్రెయినేజీ సమస్యను తీర్చడానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. దీనికోసం రూ 14.10 కోట్లు అంచనా విలువతో ఉపాధిహామీ పథకం నుండి నిధులు మంజూరు చేయించారు. 2019 డిసెంబరులో ఆట్టహాసంగా శంకుస్థాపన చేశారు. డ్రెయిన్లను నిర్మించి, వాటిని మేజర్ డ్రెయిన్ గొంతేరు లో కలిపేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించారు. గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్యశాఖ డ్రెయినేజీ నిర్మాణాలను చేపట్టింది. గ్రామంలో మొత్తం 47 డ్రెయినేజీలను నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. 2020లో కరోనా కారణంగా నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. అనంతరం నిధులు మురిగిపోయాయి. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ పరిష్కారం కాకుండా నిలిచిపోయింది. దీనిని ముందుకు తీసుకువెళ్ళేందుకు తదుపరి చర్యలు లేకపోవటంతో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. ప్రధాన డ్రయిన్ నిర్మాణం లేకుండా పలు వీధుల్లో ఇటీవల డ్రయినేజీ నిర్మాణాలు చేపట్టారు. ఈ నీరు త్రాగునీటి వనరుల ఉతీసుకువళ్ళే పీర్లకోడు ఛానల్‌లో కలుస్తుందని గ్రామస్తులు ఆందోళన చేసినా పట్టించుకోలేదు.



కలుషిత నీరు తెస్తున్న లోసరి కాల్వ



వీరవాసరంలో డ్రెయిన్ల నిర్మాణ శిలాఫలకం



వీరవాసరంలో రోడ్డు పక్కన చెత్త



కలుషిత నీరే గతి

కుళాయిలో కలుషిత నీరు వస్తుంది. వాటర్ ప్లాంట్ నీరు పైనే ఆధారపడాల్సి వస్తుంది. టిన్నులతో పట్టుకు వెళ్తాను.
నాగరాజు, దొంగపిండి



తాగునీటికి తిప్పలు

తాగునీటి తిప్పలు తప్పడం లేదు. కుళాయి నీరు తాగలేం. వాటర్ ప్లాంట్ నీరు తెచ్చుకొంటాం. ఏడాదంతా ఇదే సమస్య.
సీతమ్మ, లోసరి గ్రామం



ఎందుకీ వంతెనలు

వంతెన నిర్మించి ఉపయోగం లేదు. ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నాం. అప్రోచ్ రోడ్డు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.
నాగరాజు, తోకతిప్ప



జారిపోతున్నాం

వంతెనకు ఇరువైపులా రహదారి వేసుకున్నాం. వర్షాకాలం మోటార్ సైకిళ్లు జారి ప్రమాదాలకు గురవ్వాల్సి వస్తుంది.
శ్రీనివాస్, తోకతిప్ప



చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఆ కళాశాల బోర్డు చూస్తే.. ఎన్టీఆర్ గుర్తుకు వస్తారు

చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చూస్తే ఎన్టిఆరే గుర్తుకు వస్తారని కళాశాలలో మొదటి బ్యాచ్ విద్యార్థులు ఇప్పటికి చెబుతుంటారు. 1987 సెప్టెంబర్‌లో చింతలపూడి దుర్భిక్షప్రాంతం చూడడానికి వచ్చిన ఎన్టీఆర్ బహిరంగ సభలో మాట్లాడుతూ తన పర్యటనకు గుర్తుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వారంరోజులు తిరగకుండా కళాశాల తరగతులను ప్రారంభించారు. తొలుత స్థానిక జూనియర్ కళాశాలలోని షిప్ట్ పద్ధతిలో తరగతులు నిర్వహించారు. మొదటి బ్యాచ్ విద్యార్థులు ఇప్పటికి ఈ కళాశాలను చూసినప్పుడల్లా ఎన్‌టీఆర్‌ను గుర్తుకు తెచ్చుకుంటారు. ఆ రోజుల్లో డిగ్రీ చదవాలంటే ఏలూరు వెళ్లాల్సి వచ్చేది. ఆర్థికభారంతో ఎందరో విద్యార్థులు ఇంటర్‌తో చదువులు నిలిపివేసేవారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుతో ఉన్నత చదువు అందుబాటులోకి వచ్చింది. కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులు ఈ కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులుగా మరింత కృషిచేస్తున్నారు.

- చింతలపూడి



ఈ ఖర్చు.. దాటొద్దు

అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ఎన్నికల కమిషన్ నిఘా వేస్తుంది. ప్రచారం, సభలు, ర్యాలీలు తదితర కార్యక్రమాలపై ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎప్పటికప్పుడు లెక్కలు తీస్తారు. క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు. మరి ఆ ఖర్చును ఎలా లెక్కిస్తారు. దీనికి ఎన్నికల కమిషన్ ధరలు నిర్ణయించింది. ఎన్నికలలో అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను వివిధ విభాగాలుగా విభజించి ధరలు నిర్దేశించారు. ఆ ధరల ప్రకారమే ఎన్నికల వ్యయాన్ని చూపాల్సి ఉంటుంది. వివిధ విభాగాల్లో ధరలు ఈవిదంగా ఉన్నాయి.

- వాటర్ ప్రూఫ్ వేదిక అయితే(4నుంచి 6 అడుగులు) చదరపు అడుగుకు రూ.35, అదే సైజ్ సాధారణ వేదిక యితే చదరపు అడుగుకు రూ.25
- చేతుల కుర్చీ ఒక్కింటికి రూ. 8, సాధారణ కుర్చీ రూ.5, ఐరన్ టేబుల్ (1వెడల్పు , 6 ఎత్తు అడుగులు ఉంటే రూ.30, గ్రీన్ కార్పెట్ చ.అ. రూ. 4, రెడ్ కార్పెట్‌కు చదరపు అడుగుకు రూ.4
- 9 నుంచి 18 అడుగుల షామియానాకు రూ.300, 12 నుంచి 24 అడుగుల షామియానా రూ. 500, 18 నుంచి 18 అడుగుల షామియానా రూ. 500, 18 నుంచి 36 అడుగులు రూ. 1500, 36 నుంచి 36 అడుగుల షామియానా రూ. 3500, 54 నుంచి 54 అడుగుల జంబో షామియానా రూ. 4000, సైడ్ వాల్స్ 6నుంచి 7 అడుగుల ఎత్తు వరకు చదరపు అడుగుకు రూ.15
- ఐరన్ స్టెప్స్‌కు 3.5 అడుగులకు రూ.2వేలు. స్టీల్ ఛైర్‌కు రూ.30, స్టీల్ సోఫాకు రూ.500, మహారాజా సింగిల్ ఛైర్‌కు రూ. వెయ్యి, మహారాజా డబుల్ ఛైర్ రూ.2000, ఫాన్ ఒక్కింటికి రూ.200.
- ఫ్లెక్సీ బ్యానర్‌కు చదరపు అడుగుకు రూ.20, పైప్ పెండల్స్‌కు చదరపు అడుగుకు రూ.8. సౌండ్ సిస్టమ్ ప్రత్యేకమయితే రూ.20వేలు, సాధారణమయితే రూ. 15 వేల చొప్పున లెక్కిస్తారు.
- డ్రమ్‌లు, డస్టుబిన్‌లకు ఒక్కింటికి రూ.50, వీఐపీ ఛైర్స్ ఒక్కింటికి రూ.100, బారికేడ్ ఐరన్ ఆర్‌ఎఫ్‌టి రూ.80. స్టీల్ సోఫా విత్ కవర్ రూ.500, వీఐపీ సోఫా విత్ కవర్‌కు రూ.800. ఐరన్ టేబుల్ విత్ క్లాత్‌కు ఒక్కింటికి రూ.80
- పాంప్లెట్స్ , పోస్టర్‌లకు 3వేల కాపీలకు రూ.2242 నుంచి రూ. 35 వేలు. ఓటర్ స్లిప్‌లు సింగిల్ కలర్ లక్ష కాపీలకు రూ.29,500. కలర్ పాంప్లెట్స్, పోస్టర్‌లకు సైజుల వారీగా రూ. 1 నుంచి రూ.10. క్లాత్ బాడ్జీలకు ఒక్కింటికి రూ.25, ఫ్లెక్సీ ప్లాస్టిక్ చదరపు అడుగుకు రూ.15, క్లాత్ ఫ్లెక్సీ రూ.35, ఆటో స్టిక్కర్‌కు అడుగుకు రూ.30, క్యాప్ ఒక్కింటికి రూ.45, టి షర్ట్ ఒక్కింటికి రూ.180.
- వీడియో, ఫొటో షూట్ ఇతరాలకు రూ.354 నుంచి రూ.11,800. ఆడియో వాయిస్ రికార్డింగ్‌కు రూ.12,390 నుంచి రూ.24,780. సీడీ పెన్ డ్రైవ్‌కు 60 నిమిషాలకు రూ.12,390, 2 గంటలు అయితే రూ.17,700. ఎల్‌ఇడి స్క్రీన్స్‌కు అవుట్‌డోర్ ఎస్‌ఎఫ్‌టికి రూ.342, ఇండోర్ ఎస్‌ఎఫ్‌టికి రూ.240.
- రిఫ్రెష్‌మెంట్స్‌లో టిఫిన్స్‌కు రూ.25 నుంచి 40, టీ/కాఫీకి రూ. 8/15. స్నాక్స్‌కు రూ.5 నుంచి రూ.60, కర్డ్ రైస్ రూ.60, సాధారణ భోజనం / ప్రత్యేక భోజనానికి / బిరియానీ/ నాన్ విజ్ బిరియానీకి రూ.80 నుంచి రూ.280.
- వాటర్ ప్యాకెట్‌కు ఒక్కింటికి రూ.3, వాటర్ బాటిల్ రూ. 10 నుంచి రూ.12, మినరల్‌వాటర్ బాటిల్ రూ.15 నుంచి రూ.28.
- హోటల్ సింగిల్ రూమ్ ధర రూ.500 - రూ.5599, డబుల్ రూమ్ రూ.1680 - రూ.6159.
- హైరింగ్ వాహనాలు ఆటో, టాక్సీ అయితే రూ.310 - రూ. వెయ్యి (రోజుకు), మిగిలిన వాహనాలకు రూ.1500 - రూ.3450. ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్ళకు కూడా ధరలు నిర్ణయించారు. డ్రైవర్ బేటా కూడా రోజుకి రూ. 300 నుంచి రూ. 767.
- క్లాత్ బ్యానర్ రూ.260, క్లాత్ జెండా రూ.65, ప్లాస్టిక్ జెండా రూ.41.

- ఏలూరు సిటీ



చందాలివ్వండి... లేదంటే కేసులే

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

అధికార పార్టీలో ఆయన రాష్ట్రస్థాయి పదవి అనుభవిస్తున్న నేత. వాణిజ్య కేంద్రమైన నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అన్ని సంఘాలతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. మెకానిక్ అసోషియేషన్ సంఘ భవనానికి రూ.5 లక్షల విరాళం ఇచ్చారు. నేతది ఎంత మంచి మనసో అంటూ సభ్యులు అనుకున్నారు. పట్టణంలో మరికొన్ని సంఘాలకు సొమ్ములు ఇస్తానంటూ సంకేతాలు పంపారు. అంతా అబ్బా అనుకున్నారు. కానీ సదరు నేత చందాలు వసూళ్లకోసం ఇస్తున్న ఆదేశాలతో ఇప్పుడంతా నోరెళ్ల బెడుతున్నారు. స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. ఏకంగా కోటి రూపాయలు విరాళం ఇవ్వాలని ఆదేశించారు. బిల్డర్స్‌ను పిలుస్తున్నారు. ఎన్నిలకు చందాలు ఇవ్వాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. వ్యాపార, వాణిజ్య సంఘాలు, ఆర్థికంగా బలోపేతంగా ఉన్న వ్యాపారులను పిలిపిస్తున్నారు. చందాలు అడుగుతున్నారు. లేదంటే భవిష్యత్‌లో కేసులు తప్పవంటూ సంకేతాలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమదే నంటూ బడాయిచేస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పుడిదే హాట్ టాపిక్‌గా మారింది. తనకు మద్దతు ఇవ్వడం లేదని వేరే పార్టీలో చేరుతున్నారంటూ కొందరికి మున్సిపాలిటీ నుంచి నోటీసులు జారీ చేశారు. భవన నిర్మాణాల్లో అతిక్రమణలు చేశారంటూ తాజాగా నోటీసులు వెళ్లాయి. గతంలో అదే భవన యజమానుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసుకున్నారు.



సోమనాద్రిపురం అగ్రహారంలో వలంటీర్లతో వైసీపీ నేతల సమావేశం

రాజీనామా చేయండి..

- వైసీపీ తరపున పనిచేయాలి
- వలంటీర్లపై ఒత్తిడి
- మండవల్లి మండలంలో రహస్య సమావేశం

మండవల్లి, ఏప్రిల్ 19: వలంటీర్ వ్యవస్థతోనే ఎన్నికల నిర్వహణ చేపట్టాలన్న వైసీపీ ప్రభుత్వం ఆలోచన బెడిసికొట్టడంతో వలంటీర్లను పూర్తిస్థాయిలో ఎన్నికల నిర్వహణలో వినియోగించుకోవాలన్న ఎత్తుగడలో అధికార పార్టీ నేతలు ఉన్నారు. వలంటీర్లు ఎన్నికల నిర్వహణ విధుల్లో పాల్గొనరాదని కోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నప్పటికి వారిని వినియోగించుకుని ఎన్నికల్లో లబ్ధి పొందాలని వైసీపీ నేతలు వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నారు. మండవల్లి మండలంలో వలంటీర్ల సమావేశాన్ని శుక్రవారం మధ్యాహ్నం రహస్యంగా నిర్వహించారు. ఇప్పటికే కొంతమంది వలంటీర్లతో వైసీపీ నాయకులు బలవంతంగా రాజీనామాలు చేయించినప్పటికీ మిగిలిన వారు కూడా రాజీనామా చేసి ఎన్నికల్లో వైసీపీ విజయానికి దోహదపడాలని కొందరు నేతలు ఒత్తిడి చేయడం చర్చనీయంశమైంది. రానున్నది వైసీపీ ప్రభుత్వమని, ప్రత్యేక నోటిఫికేషన్‌తో రాజీనామా చేసిన వలంటీర్లు అందర్నీ విధుల్లోకి తీసుకుంటామంటూ హామీ ఇస్తున్నట్లు తెలిసింది. రాజీనామా చేసిన వలంటీర్లకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేసే యోచన ఉన్నట్లు చెబుతున్నారు. వినకపోతే భయపెట్టి రాజీనామా చేయించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇదంతా సమావేశ హాల్‌లో ఒక యువకుడు వీడియో తీస్తుండగా వైసీపీ సర్పంచ్ దాడి చేసినట్లు తెలిసింది.

అత్తిలిలో 270 మంది రాజీనామా

అత్తిలి: మండలంలో వలంటీర్లు రాజీనామాకు వైసీపీ నేతలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకుల జోక్యంతో మండలంలోని 407 మంది వలంటీర్లకు 270 మంది రాజీనామా చేసినట్లు సమాచారం. మరో పక్క టీడీపీ నేత అధినేత చంద్రబాబు వలంటీరు వ్యవస్థపై ఇస్తున్న భరోసాతో కొందరు పునరాలోచనలో పడ్డారు. రాజీనామాకు ససేమిరా అంటున్నారు. అధికార పార్టీ నేతలు మాత్రం వారిపై ఒత్తిడి పెంచుతున్నారు. వలంటీరు సన్నిహితులతో చెప్పిస్తున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న యువతకు వలంటీర్లుగా అవకాశం కల్పించింది. వలంటీర్లను ఎన్నికల్లో వాడుకునే యోచనలో నేతలు ఉన్నారు. కొందరు వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో నాయకుల వెంట తిరుగుతున్నారు. మిగిలిన వారిని కూడా రాజీనామా చేయాలని ఒత్తిడి పెంచుతున్నారు. పై స్థాయి నేతల ఆదేశాలతో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు వలంటీర్ల రాజీనామాకు పట్టుబడుతున్నారు. రాజీనామా చేసి మీ పరిధిలోని కుటుంబాల వద్దకు వెళ్లండి, వైసీపీకి ఓట్లు వేసేలా చూడండి, అధికారంలోకి రాగానే తిరిగి మిమ్మల్నే వలంటీర్లుగా తీసుకుంటామంటూ ఆశ చూపుతున్నారు. మరోవైపు చంద్రబాబు భరోసాతో వలంటీర్లు రాజీనామాకు వెనుకంజ వేస్తున్నారు. అక్కడక్కడ మాత్రమే అధికార పార్టీ నేతలు ఒత్తిడిని తట్టుకోలేక మాత్రమే అయిష్టంగా వైదొలుగుతున్నారు.

గోదారి దాటి.. కొండ ఎక్కి.. దిగి..



ఓటేయడానికి ఎన్ని కష్టాలో..

ఏజెన్సీ మారుమూల ప్రాంతం వారు ఓటు వేయాలంటే గోదావరి దాటాలి.. తర్వాత కొండ ఎక్కి దిగి 40 కిలో మీటర్లు నడవాల్సిందే. వేలేరుపాడు మండలం కొయిదా పంచాయతీ పరిధిలో కాకవిసనూరు గ్రామం ఉండగా కొండరెడ్డి గిరిజనులు నివాసం ఉంటున్నారు. గ్రామంలో సుమారు 60 కుటుంబాల్లో 120 మందికి పోలవరం నియోజకవర్గంలో ఓటు ఉంది. ఈ గ్రామం పోలింగ్ కేంద్రానికి 40 నుంచి 50 కిలో మీటర్లు దూరంలో ఉంది. వారంతా బోటు లేదా లాంచిలో ప్రయాణించి గోదావరి దాటి కొండలు ఎక్కి దిగి పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. వారంతా ఓటుహక్కును వినియోగించుకోడానికి ఏర్పాట్లు చేశామని, ప్రత్యేకంగా ఒక బోటు సిద్ధం చేశామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు.

- బుట్టాయగూడెం

జన కేతనం
ఆంధ్రజ్యోతి
7
ఉమ్మడి పశ్చిమ గోదావరి
శనివారం 20 ఏప్రిల్ 2024


నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం

ఫ్లాష్ బ్యాక్

ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు పశ్చిమగోదావరి, ప్రస్తుతం తెలంగాణలో ఉన్న ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట వంటి ప్రాంతాలు నూజివీడు సంస్థానంలో భాగంగా ఉండేది. దాదాపు 14 పరిగణాలుగా ఉన్న ఈ నూజివీడు సంస్థానం స్వాతంత్ర్య అనంతరం మూడు జిల్లాలుగా విభజితమైంది. అనంతరం ఈ సంస్థానం దాదాపు 20 నియోజకవర్గాలుగా విభజితమైంది స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లాలో నూజివీడు డివిజన్ (14 మండలాలతో) అతిపెద్ద డివిజన్‌గా ఉండేది. జాతీయ స్థాయిలో శాశించిన ప్రముఖులకు ఈ నూజివీడు నియోజకవర్గం జన్మభూమి అంటే అతిశయోక్తి కాదు. నూజివీడు కేంద్రంగా నూజివీడు సంస్థాధినేతగా పేరుగాంచిన మాజీ మంత్రి, ఆంధ్రా యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎమ్మార్ అప్పారావుతో పాటు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మాజీ రాజ్యసభ సభ్యులు దాసరి నాగభూషణరావు, రైతు సంఘం జాతీయ నాయకులు కొల్లి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు, మాజీ మంత్రి, దివంగత ఎమ్మెల్సీ పాలడుగు వెంకట్రావు వంటి దిగ్గజాలు ఈ నియోజకవర్గం వారే.



భారత స్వాతంత్ర్య సమరంలో నూజివీడు సంస్థానం ప్రముఖపాత్ర పోషించింది. ఉద్యమాల పురిటిగడ్డగా ఒకానొక దశలో కమ్యూనిజం భావాలతో భూదానోద్యమం కేంద్రంగా నిలిచింది. నూజివీడు నియోజక వర్గంలో నూజివీడు మున్సిపాల్టీతో పాటు ముసునూరు, ఆగిరిపల్లి, నూజివీడు మండలంతో పాటు పాత నియోజకవర్గంలో బాపులపాడు మండలంలోని కొన్ని ప్రాంతాలు అంతర్భాగంగా ఉండేవి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అనంతరం బాపులపాడు మండలంలోని గ్రామాలు గన్నవరం నియోజకవర్గంలో విలీనం కాగా తిరువూరు నియోజకవర్గం నుంచి చాట్రాయి మండలాన్ని నూజివీడు నియోజకవర్గంలో విలీనం చేశారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గం నాలుగు మండలాలు, ఒక మున్సిపాల్టీతో 2,37,139 మంది ఓటర్లను కలిగి ఉంది. ఇందులో పురుషులు 1,17,398 మంది కాగా, మహిళలు 1,19,730 మంది, ఇతరులు 11 మంది ఉన్నారు.
- నూజివీడు

ఉద్ధండుల కోట

మహామహులు ఏలిన నూజివీడు


నూజివీడు కోటగుమ్మం

అన్ని పార్టీలకు ఆదరణ

955 నుంచి ఉమ్మడి కృష్ణాజిల్లాలో నూజివీడు నియోజకవర్గం అంత ర్యాగంగా ఉంది. ఈ నియోజకవర్గం దాదాపు అన్ని పార్టీలను సమానంగా ఆద రించిందని చెప్పవచ్చు. తొలితరం కాంగ్రెస్ పార్టీ నుంచి శాసనసభ్యులు ఎన్నిక కాగా తదుపరి తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తరువాత ఈ నియోజకవర్గం తెలుగుదేశానికి కంచుకోటగా ఉంది. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అనం తరం చాట్రాయి మండలం ఈ నియోజకవర్గంలో చేరడంతో కొన్ని రాజకీయ సమీకరణాలు మారి తిరిగి ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రాబల్యం పెరిగింది. దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి చనిపోయిన తరువాత కాంగ్రెస్ స్థానాన్ని ఇక్కడ వైసీపీ భర్తీ చేయడంతో వైసీపీ ప్రాబల్యం కనిపిస్తోంది. తొలిసారిగా నూజివీడు సంస్థానాదీశుడు అయిన మేకా రంగయ్య అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన 1955 నుంచి 1978 వరకు శాసనసభ్యుడిగా పనిచేయగా, ఈ కాలంలో ఆయన రాష్ట్రమంత్రిగా కూడా వ్యవహరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కోటగిరి హనుమంతురావు ఇక్కడ చక్రం తిప్పారు. తొలుత 1983లో ఈయన ఇక్కడ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలిచి, తెలుగుదేశం పార్టీలో చేరారు. అక్కడి నుంచి ఆయన దాదాపు 15 సంవత్సరాల పాటు తెలుగుదేశం శాసన సభ్యుడిగా పనిచేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పాలడుగు వెంకట్రావు చక్రం తిప్పగా ఈయన సైతం రెండు పర్యాయాలు శాసన సభ్యుడిగా, ఒక పర్యాయం విధాన సభకు ప్రాతినిధ్యం వహించడమే కాక మంత్రిగా కూడా పనిచేశారు. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో కీలకపాత్ర వహించిన మేకా ప్రతాప్ తన రాజకీయ గురువు అయిన కోటగిరి హనుమంతు రావుతో విభేదించి 1994లో తొలిసారి ఇక్కడి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి శాసనసభ్యునిగా గెలుపొందారు.అనంతరం వైసీపీలో చేరి వరుసగా రెండుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. దాదాపు 15 సంవత్సరాల పాటు శాసనసభ్యుడిగా కొనసాగారు. మధ్యలో 2009లో ఒకసారి తెలుగుదేశం పార్టీ నుంచి డాక్టర్ చిన్నం రామకోటయ్య ఇక్కడి నుంచి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. నూజివీడు సంస్థానాదీశుడు ఎమ్మార్ అప్పారావు అత్యధికకాలం 22 సంవత్సరాల పాటు శాసన సభ్యునిగా కొనసాగగా, చిన్నం రామకోటయ్య మినహా మిగిలిన వారు దాదాపు మూడుసార్లు ఇక్కడి నుంచి అధికారంలో ఉన్నారు.

నూజివీడు నియోజకవర్గ వ్యాప్తంగా 286 పోలింగ్ స్టేషన్లు ఉండగా, నూజివీడు మున్సిపల్ పరిధిలో 48, నూజివీడు రూరల్ మండలపరిధిలో 71, ముసునూరు మండలపరిధిలో 57, చాట్రాయి మండలపరిధిలో 51, ఆగిరిపల్లి మండలపరిధిలో 59 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. నూజివీడు నియోజకవర్గ పరిధిలో మొత్తం పోలింగ్‌స్టేషన్లు 286గా ఉంది.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు	ప్రత్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
1955	మేకా రంగయ్య అప్పారావు	ఏకగ్రీవం				
1962	మేకా రంగయ్య అప్పారావు	కాంగ్రెస్	35,244	దాసరి నాగభూషణరావు	సీపీఐ	21,235
1967	మేకా రంగయ్య అప్పారావు	కాంగ్రెస్	36,468	తిరువూరు మధుసూదన్‌రావు	స్వతంత్ర	28,294
1972	మేకా రంగయ్య అప్పారావు	కాంగ్రెస్	36,689	మాదల వెంకటేశ్వరరావు	స్వతంత్ర	27,564
1978	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	40,524	విద్యుత్ కుమార్ అప్పారావు	ఆర్-కాంగ్రెస్	37,270
1983	కోటగిరి హనుమంతురావు	స్వతంత్ర	30,267	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	25,924
1985	కోటగిరి హనుమంతురావు	టీడీపీ	50,282	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్)	46,688
1989	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	60,378	మేకా రంగయ్య అప్పారావు	టీడీపీ	56,784
1994	కోటగిరి హనుమంతురావు	టీడీపీ	63,202	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	50,377
1999	కోటగిరి హనుమంతురావు	టీడీపీ	46,139	పాలడుగు వెంకట్రావు	కాంగ్రెస్	42,670
2004	మేకా ప్రతాప్ అప్పారావు	కాంగ్రెస్	80,706	కోటగిరి హనుమంతరావు	టీడీపీ	61,499
2009	చిన్నం రామకోటయ్య	టీడీపీ	70,206	మేకా ప్రతాప్ అప్పారావు	కాంగ్రెస్	65,063
2014	మేకా ప్రతాప్ అప్పారావు	వైసీపీ	95,565	ముద్దరబోయిన వెంకటేశ్వరరావు	టీడీపీ	85,168
2019	మేకా ప్రతాప్ అప్పారావు	వైసీపీ	1,01,950	ముద్దరబోయిన వెంకటేశ్వరరావు	టీడీపీ	85,740

ప్రపంచ ప్రసిద్ధి..నూజివీడు మామిడి

ప్రపంచంలో ఏ మూలకువెళ్ళినా నూజివీడు మామిడికి ఉన్న చారిత్రక ప్రసిద్ధి మరువలేం. పచ్చని మామిడితోటలతో అలరాడే ఈ ప్రాంతం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత మెట్ట ప్రాంతం. ఈ ప్రాంతంలో మామిడి పరిశోధనా కేంద్రంతో పాటు ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాలతో ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం లభిస్తోంది. ప్రతి సీజన్‌లో అనేక వేలటన్నులు మామిడి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు తరలివెళుతోంది. దీంతో పాటు ఆధ్యాత్మిక ప్రాంతంగా ఈ ప్రాంతం అలరారుతోంది. ఆగిరిపల్లి శ్రీ వ్యాఘ్రలక్ష్మి నరసింహస్వామి దేవస్థానం, మరోవైపు ముసునూరు మండలంలోని బలివే రామలింగేశ్వరస్వామి, నూజివీడు మండలంలోని గొల్లపల్లి రఘునాథ స్వామిదేవస్థానం, చాట్రాయి మండలం చనుబండ కోదండరామస్వామి దేవాలయం వంటి పురాతన దేవాలయాలు నూజివీడు ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తున్నాయి. దీంతోపాటు ఈ ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లు అనటంలో అతిశయోక్తి లేదు. నూజివీడు ప్రాంతం నుంచి బాస్కెట్‌బాల్,వాలీబాల్, టెన్నీకాయిట్ వంటి క్రీడాంశాల్లో ప్రావీణ్యం సాధించారు. ఏ ప్రాంతానికి వెళ్ళినా ఇక్కడి వారు ఉపాధి, ఉద్యోగ రంగాల్లో స్థిరపడిన వారిని చూడవచ్చు.



అభ్యర్థుల ఆస్తిపాస్తుల చిట్టా

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కీలకమైన నామినేషన్ పత్రాల స్వీకరణ మొదలైంది. శుక్రవారం అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు వారి ఆస్తుల వివరాలతో అఫిడవిట్‌లు సమర్పించారు.

ఆచంట : పితాని సత్యనారాయణ (టీడీపీ)



వయసు : 71 సంవత్సరాలు
విద్యార్హత : డిగ్రీ (బీకాం)
కేసులు : రెండు ఉన్నాయి
బ్యాంక్ బ్యాలెన్స్ : రూ.36 లక్షలు
భార్య అనంతలక్ష్మి పేరున : 9 లక్షలు
ఆస్తులు : రూ. 10.73 కోట్లు
భార్య పేరిట : రూ. 3.51 కోట్లు
అప్పులు పితాని పేరిట రూ. 2.72 లక్షలు

ఆచంట : చెరుకువాడ శ్రీరంగనాథరాజు (వైసీపీ)



వయసు : 70
విద్యార్హత : 9వ తరగతి
బ్యాంక్ బ్యాలెన్స్ : రూ.20.46 లక్షలు
భార్య పేరున : రూ. 17.53 లక్షలు
చరాస్థులు : రూ. 3.80 కోట్లు
భార్య పేరిట రూ. 9.56 కోట్లు
అప్పులు : రూ. 16 కోట్ల 46 లక్షలు

తాడేపల్లిగూడెం : బొలిశెట్టి శ్రీనివాస్ (జనసేన)



వయసు : 62
విద్యార్హత: బీకాం
కేసులు : నాలుగు
చరాస్తులు: రూ.15 కోట్ల 92 లక్షల 65 వేలు
భార్యపేరున: 7,08,950
స్థిరాస్తి : రూ. 6 కోట్ల 4 లక్షల 45 వేలు
భార్య పేరున : రూ.2,27,83
బంగారం విలువ: రూ.3,40,250, భార్యపేరున : 6,80,500
అప్పులు: రూ.17 కోట్ల 18 లక్షలు
కియా కారు, ఇతర వాహనాల విలువ: రూ.98.92 లక్షలు

నరసాపురం : ముదునూరి ప్రసాదరాజు (వైసీపీ)



వయసు : 50
విద్యార్హత : ఇంటర్
చరాసులు :రూ. 57.72 లక్షలు
స్థిరాస్తులు రూ. 59.41 లక్షలు
సొంత ఇంటి విలువ :రూ.29.26 లక్షలు
బంగారం విలువ : రూ. 7.08 లక్షలు
అప్పులు : రూ. 1 కోటీ 83 లక్షల 90 వేలు
రెండు కార్లు : రూ. 36.04 లక్షలు
సతీమణి శారదాదేవి పేరుతో చరాస్తులు : రూ..62.11 లక్షలు, బంగారం: రూ.35.75 లక్షలు, వెండి: రూ.3.60 లక్షలు
అప్పులు రూ. 12.38 లక్షలు
వాహనాల విలువ రూ. 25.35 లక్షలు

తణుకు : ఆరిమిల్లి రాధాకృష్ణ (టీడీపీ)



వయసు : 50
విద్యార్హతలు : ఎంఎస్‌సి
కేసులు : ఏడు ఉన్నాయి
చరాస్థులు : 4,22,80,548
భార్య పేరిట : 6.28, కోట్లు
స్థిరాస్తి : 14. 49 కోట్లు
భార్య పేరిట : 4.03 కోట్లు
సొంతింటి విలువ : 2.42 కోట్లు
బంగారం విలువ : 20,80,00,భార్య పేరున : 1,27,09,500
అప్పులు : 1,12,98,454, భార్య పేరన : 13,28,832
వాహనాలు : టాటా సఫారి రూ.4,29,653, ఫోర్డు ఎండీవర్- రూ.18,46,394, భార్య పేరున బెంజ్ కారు రూ. 28,11,144

తణుకు : కారుమూరి నాగేశ్వరరావు (వైసీపీ)



వయసు : 59
విద్యార్హత : 7వ తరగతి
చరాస్తులు : 94.75 లక్షలు
భార్య పేరున : 1.35 కోట్లు
స్థిరాస్తి : 6.57 కోట్లు
భార్యపేరున : 19.17 కోట్లు
సొంతింటి విలువ : 4 కోట్లు
బంగారం : 17,25,000, భార్య పేరున : 69,00,000
అప్పులు : రూ.30 లక్షలు, భార్య పేరున : రూ.25 లక్షలు
వాహనాలు : ఇన్నోవా రూ.16 లక్షలు
భార్య పేరున : వోక్సు వేగన్ రూ.4 లక్షలు

భీమవరం : గ్రంధి శ్రీనివాస్ (వైసీపీ)



వయసు : 60
విద్యార్హత : ఇంటర్
చరాస్తులు : రూ.3.44 కోట్లు
భార్య పేరున : రూ. 1.54 కోట్లు
కుటుంబ సభ్యులు : రూ.15.03 కోట్లు
స్థిరాస్తులు : రూ.18.16 కోట్లు
భార్య పేరున : రూ.64.34 లక్షలు, కుటుంబం : రూ.62.09 కోట్లు
అప్పులు : రూ. 12.20 కోట్లు, భార్య పేరున: రూ.28.95 లక్షలు , కుటుంబం : రూ.57.51 లక్షలు

పాలకొల్లు : నిమ్మల రామానాయుడు (టీడీపీ)



వయసు : 54
విద్యార్హత : ఎంఎ పీహెచ్‌డీ
చరాస్తులు : రూ. 36. 38 లక్షలు
స్థిరాస్థి : 3.16 కోట్లు
భార్య పేరున : 1.17 కోట్లు
స్థిరాస్తి : రూ1.65 కోట్లు
నివాస భవనం విలువ : రూ. 50 లక్షలు
బంగారం : 1130 గ్రాములు
కుమార్తె పేరున : నగదు రూ1.40 లక్షలు డిపాజిట్, 200 గ్రాముల బంగారం. రూ. 51.48 లక్షలు విలువైన 2.86 ఎకరాల భూమి, కుమారుడు పేరున : రూ. 60,400

నూజివీడు : మేకా వెంకట ప్రతాప్ అప్పారావు (వైసీపీ)



వయసు : 73
విద్యార్హత : డిగ్రీ
స్థిరాస్తులు: రూ.20.01 కోట్లు
చరాస్తులు : రూ.47.55 లక్షలు
భార్య పేరున : రూ.44. 87లక్షలు
కుటుంబ సభ్యుల పేరున : రూ.7.64 కోట్లు
రూ.15 లక్షలు విలువచేసే 2015 మోడల్ టయోటా పార్చ్యునర్ కారు,రూ.50 వేలు విలువ చేసే మహీంద్రా జీపు.


భారీ ర్యాలీగా పితాని సత్యనారాయణ


బైక్‌లపై ర్యాలీగా వస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్

జోరుగా..హుషారుగా

అభ్యర్థుల నామినేషన్లు

జనసంద్రమైన తణుకు పురవీధులు

తణుకు, ఏప్రిల్ 19 : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ నామినేషన్ సందర్భంగా తణుకు పురవీధులన్నీ కార్యకర్తలు, నాయకులతో కిక్కిరిసిపోయింది. శుక్రవారం ఉదయం ఉండ్రాజవరం రోడ్‌లోని ఆరిమిల్లి నివాసం వద్ద నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మధ్య భారీ ర్యాలీ ప్రారంభమైంది. ఆరిమిల్లి ఇంటి సమీపం లోని రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి, పాదయాత్ర హైవే మీదుగా షర్మిష్ట దగ్గర నుంచి వెంకటేశ్వర సెంటర్ మీదుగా రాష్ట్రపతి రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. ముందుగా వేల్పూరు, తణుకులోని పలు దేవా లయాలను సందర్శించారు. శుక్రవారం ఆరిమిల్లి రాధాకృష్ణ, కృష్ణతులసి, తల్లిదండ్రులు చక్రధరరావు, వెంకటలక్ష్మి పూజలు చేశారు. వేల్పూరులోని ఈశ్వరమ్మ ఆలయం, తణుకు వినాయకుని ఆలయం, మండపాకలోని యల్లారమ్మ అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆచంటేశ్వరుని ఆలయంలో పూజలు చేసి..

ఆచంట : ఆచంట నుండి టీడీపీ కూటమి అభ్యర్థిగా పితాని సత్యనారాయణ , వైసీపీ అభ్యర్థిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజులు శుక్రవారం తమ నామినేషన్‌లు దాఖలు చేశారు. కొమ్ముచిక్కాల నుంచి కార్యకర్తలతో పెద్ద సంఖ్యలో ర్యాలీగా పితాని ఆచంట వచ్చి నామినేషన్‌లు దాఖలు చేశా రు. ముందుగా పితాని మార్టేరులోని వెంకటేశ్వరస్వామి, దుర్గమ్మ ఆలయాల్లో పూజలు చేశారు. ఆచంటలోని ఆచంటే శ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం వద్దే నామినేషన్‌ల పత్రాలపై సంతకాలు చేసి అనంతరం ఎన్నికల కార్యాలయం వద్దకు వెళ్లి తమ నామినేషన్‌లు దాఖలు చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామ లక్ష్మి , ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాదవ నాయుడు పాల్గొన్నారు.

పూలపల్లి నుంచి నిమ్మల సైకిల్ ర్యాలీ

పాలకొల్లు రూరల్ : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలకొల్లు అసెంబ్లీ అభ్యర్థి నిమ్మల రామానాయుడు పూలపల్లి వైజంక్షన్ నుంచి గాంధీబొమ్మలు సెంటరు, పెదగోపురం మెయిన్‌రోడ్డు మీదుగా భారీ సైకిల్ ర్యాలీగా పాలకొల్లు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణంలోని అన్ని వార్డులు నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైకిళ్లు తొక్కుకుంటూ భారీగా తరలివచ్చారు. అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. పూలపల్లి నుంచి ప్రారంభమైన సైకిళ్ల ర్యాలీ పట్టణంలో సుమారు 4 గంటల పాటు సాగింది. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, జనసేన రాష్ట్ర ప్రచార విభాగం కన్వీనర్ బన్నీ వాసు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఉన్న మట్ల కబర్ధి, గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరు నాయుడు పాల్గొన్నారు.


సైకిళ్లపై ర్యాలీగా వస్తున్న నిమ్మల రామానాయుడు

బొలిశెట్టి భారీ బైక్ ర్యాలీ

పెంటపాడు : తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం కుటుంబ సమేతంగా కే.పెంటపాడు భైరాగిమఠం వేణుగోపాలస్వామి, ఆంజనేస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీడీపీ నియోజ కవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి , బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు , జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేష్‌లతో కలసి వేల మందితో బైక్ ర్యాలీ చేసుకుంటూ కేరళా వాయిద్యాల నడుమ తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. తోటగోపి, కిలపర్తి వెంకట్రావు, ఫుల్లా బాబి, దాసరి అప్పన్న, గంధం సతీష్, నరాలశెట్టి సంతోష్‌కుమార్, తనుబుద్ధి భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకున్న ఆరిమిల్లి కుటంబ సభ్యులు


భైరాగిమఠం స్వామివారిని దర్శించుకున్న బొలిశెట్టి


ట్రాఫిక్ జామ్‌తో నిలిచిన వాహనాలు

ముహూర్తం దాటిపోయింది..

ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి సమయానికి నామినేషన్ వేయలేకపోయిన అబ్బయ్యచౌదరి

పెదవేగి,ఏప్రిల్ 19 :దెందు లూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అనుకున్న ముహూర్తం ప్రకారం 11.58 గంటలకు నామినేషన్ వేయాల్సి ఉంది. అయితే భారీ ర్యాలీలో చిక్కుకున్న ఆయన ఆ సమయానికి చేరుకోలేకపోవడంతో అబ్బయ్య చౌదరి తండ్రి కొఠారు రామ చంద్రరావు కుమారుని నామినేషన్ పత్రాలను అనుకున్న సమయానికి ఎన్నికల అధికారిణి లావణ్యవేణికి అందించారు. ర్యాలీగా మధ్యాహ్నానికి దెందులూరు చేరుకున్న అబ్బయ్య చౌదరి మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి మరో సెట్టు నామినేషన్ పత్రా లను ఎన్నికల అధికారికి అందించారు. భారీ ర్యాలీ కారణంగా దారి పొడవునా ట్రాఫిక్ జామవడం ఎండతీవ్రత అధికంగా ఉండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సుల్లో చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులకు సైతం అవస్థలు తప్పలేదు.

తణుకులో తోపులాట

ఇరగవరం, ఏప్రిల్ 19 : తణుకు నియోజ కవర్గంలో శుక్రవారం ఇరు పార్టీల నాయకులు నామినేషన్లు దాఖలు సమయంలో కొంత ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ అభ్యర్థి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దువ్వ గ్రామం నుంచి పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అదే సమయంలో కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ భారీ జనసందోహం మధ్య నామినేషన్ దాఖలు చేసేందుకు తహసీల్దార్ కార్యా లయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న వైసీపీ నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల నినాదాలతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతా వరణం నెలకొంది. ఈనేపథ్యంలో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు.



ఆల్ ది బెస్ట్



ప్రత్యర్థులిద్దరూ ఒకరికొకరు షేక్ హ్యాండ్ ఇచ్చి ఆల్ ది బెస్ట్ చెప్పుకు న్నారు. నరసాపురం వైసీపీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు నామి నేషన్ వేసేందుకు వెళుతుండగా ప్రచారానికి వెళుతున్న జనసేన అభ్యర్థి నాయకర్‌లు శుక్రవారం ఎదురెదురుగా తారసపడ్డారు.



అంజిబాబు సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

ప్రశాంత భీమవరం కోసం కృషిచేద్దాం: అంజిబాబు

భీమవరం టౌన్, ఏప్రిల్ 19 : ప్రశాంత భీమవరం కోసం కృషి చేద్దామని, రాక్షస పాలనకు స్వస్తి చెబుదామని మాజీ ఎమ్మెల్యే, భీమవరం జనసేన ఉమ్మడి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలంలో వైసీపీ సర్పంచ్ రా ట్నాల పేరయ్య (రాజా) జనసేన పార్టీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, పార్టీ అభ్యర్థి అంజిబాబు సమక్షంలో కొమరాడ జనసేన అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం, గంజాల నాయుడు, రాంజీ శిఖమని, మెల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల్లో టీడీపీ కూటమి అఖండ విజయం సాధిస్తుందని, కూటమి అధికారంలోకి రాగానే పింఛను రూ.4వేలు చేస్తామని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గోవిందబాబు మాట్లాడుతూ సౌమ్యుడు శాంతి స్వరూపుడు అంజి బాబు అని, పదేళ్లలో ఎటువంటి ఘర్షణలు లేకుండా సుపరిపాలన అందించారని, అటువంటి అంజిబాబును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, బండి రమేష్ కుమార్, కత్తుల నిలేంద్ర పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 12వ వార్డుకు చెందిన వైసీపీ కార్యకర్తలు జనసేన పార్టీలోకి చేరారు. స్థానిక ఉమ్మడి పార్టీ శిబిరంలో గరికపాటి బాబి, కొప్పునిడి శ్రీను ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు (అంజిబాబు) సమక్షంలో 50 మంది పార్టీలోకి చేరారు. వారికి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.





తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం... అలంకరణలో స్వామివారు

బైరాగిమఠంలో ఘనంగా తెప్పోత్సవం

పెంటపాడు, ఏప్రిల్ 19: నవమి ఉత్సవాల్లో భాగంగా కే.పెంటపాడు బైరాగిమఠం గోపాలస్వామి, ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ సమీపంలో ఉన్న పుష్కరిణిలో ప్రత్యేకంగా అలంకరించిన హంసవాహనంపై గోపాలస్వామి వారి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. భారీ బాణ సంచా కాల్చారు. తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం మేళతాళాలు, బుట్టబొమ్మలు, విచిత్ర వేషధారణల నడుమ స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. శనివారం చక్రస్నాన పూజలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఫిట్ పర్సన్ ఎ. రవిశంకర్, నిర్వాహకులు తెలిపారు.

తారెత్తిస్తున్న ఎండలు..

అత్తిలి, ఏప్రిల్ 19 : భానుడి ప్రతాపంతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటలు దాటితే బయటకు రావడానికి భయపడుతున్నారు. జిల్లాలో అన్ని చోట్ల దాదాపు 40 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదవుతోంది. వ్యవసాయ, ఉపాధి కూలీలు పని నుంచి ఇంటికి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం భగభగ మండే ఎండలో ఇంటికి వచ్చేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారులన్నీ నిర్మానుషంగా మారుతున్నాయి.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అంగరంగ వైభవంగా స్వామివార్ల కల్యాణం

పాలకొలు అర్బన్, ఏప్రిల్ 19: క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వేకువ జామున క్షీరా రామలింగేశ్వర స్వామి-పార్వతీ దేవి, క్షేత్రపాలకుడు శ్రీజనార్దన స్వామి-శ్రీలక్ష్మీ దేవి కల్యాం వేద మంత్రాల మధ్య అంగరరంగ వైభవంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి యాళ్ళ సూర్యనారాయణ దంపతులు కల్యాణాన్ని జరిపించారు. ఈసందర్భంగా భారీ ఎత్తున బాణ సంచా కాల్పులు జరిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. సాయంత్రం 4 గంటలకు స్వామివార్ల రథోత్సవం మేళ తాళాలు, కేరళ నృత్యాలు, బ్యాండ్ మేళాలతో పట్టణంలో నిర్వహించారు. భక్తులు గాదె వెంకట సుబ్బారావు దంపతులు భక్తులకు గిఫ్ట ఆర్టికల్స్ పంపిణీ చేశారు. శ్రీక్షీరా రామలింగేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు రక్షా బంధనాలు కట్టారు. అలాగే యూనియన్ బ్యాంక్ తరపున క్యాషియర్ భక్తులకు ప్రసాదం లడ్డులు అందించారు.

రథోత్సవంలో అపశ్రుతి

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 19 : స్థానిక శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి కల్యాణం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన రథోత్సవ కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకున్నది. రథోత్సవం వెళుతుండగా మెయిన్ రోడ్డులో విద్యుత్ వైర్లుకు తగలడంతో రథం శిఖరం పడిపోయింది. అయితే అప్రమత్తమైన భక్తులు శిఖరాన్ని తీసి అర్చకులకు ఇవ్వగా సంప్రోక్షణ గావించి, రథానికి యథావిధిగా అలంకరించడంతో రథోత్సవం యథావిధిగా జరిగింది.

మీ సమస్యల్ని పరిష్కరిస్తా: నాయకర్



ప్రచారం చేస్తున్న బొమ్మిడి నాయకర్

నరసాపురం రూరల్, ఏప్రిల్ 19: గెలిపిస్తే మీ సమస్యలన్నింటిని పరిష్కరించే బాధ్యత నాదని జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ హామీ ఇచ్చారు. శుక్రవారం సీతారాంపురం గ్రామంలో కూటమి నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ మేకల సతీష్, పటేల్‌నాయుడు, కలవకొలను తాతాజీ, కొండవీటి త్రినాథ్, బందెల రవీంద్ర, ఆకన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

జనసేనలో చేరికలు

పెంటపాడు, ఏప్రిల్ 19: తాడేపల్లిగూడెంలో అవినీతి పాలనను నిరోధించి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బోడపాడు వైసీపీ నాయకుడు మట్టా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రాంబరికిల బాలమురళీకృష్ణ, ఉప సర్పంచ్ కె.చిన్నారావు, వార్డుసభ్యుడు రాంబరికి శ్రీనివాస్ తదితరులతో పాటు పెదతాడేపల్లి, చింతపల్లి గ్రామస్థులు పలువురు బొలిశెట్టి సమక్షంలో జనసేనలో చేరారు. కండువా కప్పి బొలిశెట్టి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. తోట గోపి, పుల్లాబాబి తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

పెంటపాడు, ఏప్రిల్ 19: నవమి ఉత్సవాల్లో భాగంగా పెంటపాడు వెలంపేట రామాలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం సుమారు 5 వేల మందికి భారీ అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హాస్టల్‌కు విద్యా సామగ్రి అందజేత

పెంటపాడు, ఏప్రిల్ 19: పెంటపాడు, పరిమెళ్ళ, తాడేపల్లిగూడెం హాస్టళ్లకు మానవత ఆధ్వర్యంలో శుక్రవారం రూ.12 వేలు విలువ చేసే సీలింగ్ ఫ్యాన్స్, ట్యూబ్ లైట్లు, విద్యాసామగ్రిని ఎంతవో రామకృష్ణ, మానవత ఉమ్మడి జిల్లా చైర్మన్ తాడేపల్లి మోహన్‌రావు చేతుల మీదుగా హాస్టల్ వార్డెన్స్ రాము, నారాయణరావుకు అందజేశారు. మండల మానవత అధ్యక్షుడు నల్లమిల్లి ప్రభాకర్‌రెడ్డి, రామలింగేశ్వరరావు, ప్రసాద్, నక్కా సాంబశివరావు, సీహెచ్.సాంబశంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి వైద్యనిపుణులు

పెంటపాడు, ఏప్రిల్ 19: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 21న విజయవాడ నుంచి నరాల వైద్య నిపుణుడు డాక్టర్ తీగల రమేష్, హైదారాబాద్ నుంచి చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ దెందుకూరి ప్రత్యూష(ఎండీ) విచేస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఆసుపత్రి లో అవసరమైన వారికి అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తామని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాడేపల్లిగూడెం మండలం నందమూరులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. రూరల్ సిబ్బంది కార్లు, స్కూటీలతోపాటు అనుమానాస్పద వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నారు.

నియమావళి ప్రకారమే అభ్యర్థుల ఖర్చులుండాలి



రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద వ్యయ పరిశీలకుడు విక్రమాదిత్య మీనా

ఉండి, ఏప్రిల్ 19: ఎన్నికల నియమావళి ప్రకారమే అభ్యర్థుల ఖర్చులు ఉండాలని వ్యయ పరిశీలకుడు విక్రమాదిత్య మీనా తెలిపారు. శుక్రవారం ఉండిలో ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల ఖర్చుల వివరాల నిమిత్తం ఆరా తీశారు. నామినేషన్ వేయడానికి అభ్యర్థులు ఎన్ని కార్లలో వస్తున్నారు. ఎంతమంది వస్తున్నారు. ర్యాలీగా వస్తున్నారా తదితర వివరాలను ఎన్నికల అధికారులు ఆరా తీశారు. అలాగే అభ్యర్థులు కూడా వచ్చి బయటు ఎంత మంది వుంటున్నారు. తదితర విషయాలను ఆరా తీసి వివరాలను నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు. అభ్యర్థుల విషయంలో ప్రతీరోజు సంబంధిత ఖర్చులు వివరాలను రిపోర్టును అందించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

నామినేషన్లకు పోలీసు బందోబస్తు



ఉండి, ఏప్రిల్ 19:ఎన్నికల నియామవాళి ప్రకారమే లోపలకు వెళ్లడానికి అనుమతులు ఇస్తున్నట్లు ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఉండి- అసెంబ్లి నియోజకవర్గానికి రెండోవరోజు నామినేషన్లు స్వీకరణకు ఎన్నికలు అధికారులు, పోలీసులు ప్రత్యేక చర్యలను తీసుకున్నారు. రిటర్నింగ్ కార్యాలయం గేట్ వద్ద ఉండి ఎస్ఐ లక్ష్మీణ్‌తో పాటు ఆరుగురు పోలీసులు, 100మీటర్ల దూరం దాటిన తరువాత ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నాగబాబు, ఏఎస్ఐ యెషయా తదితరులు భద్రతగా వున్నారు. అభ్యర్థులు నామినేషను వేయడానికి వెళ్లేవారు నిబంధనలు ప్రకారం లోపలకు పంపించి మిగతా వారిని బయుట నిలుపుదల చేసే చర్యలు చేపట్టారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

జాతీయస్థాయిలో మార్టేరు వరివంగడాలకు ఖ్యాతి

పెనుమంట్ర, ఏప్రిల్ 19: మార్టేరు వరి వంగడాలు జాతీయస్థాయిలో ఖ్యాతిని పొందాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్. ప్రశాంతి అన్నారు. శుక్రవారం మార్టేరు వరిశోధన కేంద్రంలో గోదావరి మండలాల పరిశోధన, విస్తరణ మండలి సమావేశం నిర్వహించారు విస్తరణ సంచాలకులు డాక్టర్ కెఎస్ఎస్ నాయక్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు ఎంటియు 1271 వరి వంగడం రైతుక్షేత్రంలో మంచి దిగుబడి సాధించిందని అన్నారు అంతేకాకుండ ఎగుమతికి అనువుగా ఉండే పొడవాటి గింజ రకాల ఉత్పత్తి, అధిక పోషక విలువలు కలిగిన మేలైన వరి వంగడాలను మొదలైన అంశాలపై పరిశోధనలు ముమ్మరం చేయాలని అన్నారు. విస్తరణ అధికారులు శాస్త్రవేత్తలు కలిసికట్టుగా చర్చించి తదుపరి కార్యాచరణ రూపొందించాలన్నారు కృషి విజ్ఞాన కేంద్రాలు కేవీకేలు జిల్లాకు ఒకటి చొప్పున పెట్టడానికి తగిన ప్రయత్నాలు జరుగుతున్నాయన్నాయని విస్తరణ సంచాలకులు డాక్టర్ కె ఎస్ ఎస్ నాయక్ చెప్పారు. క్షేత్రస్థాయిలో విద్యా శిక్షణ కార్యక్రమాలు రూపొందించి విధిగా శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జీజే వెంకటేశ్వరరావు, ఎస్.మాధవరావు, హబీబ్ బాషా, శ్రీహరి, జ్యోతిర్మయి ఏడీఆర్ డాక్టర్ డి.శ్రీనివాస్, మార్టేరు వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు అధికారులు రైతులు పాల్గొన్నారు

ఫార్వర్డ్ బ్లాక్ ఎంపీ అభ్యర్థిగా హరనాథ్ రాజు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 19: ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ నర్సాపురం పార్లమెంటు అభ్యర్థిగా నడింపల్లి హరనాథ్‌రాజుకి శుక్రవారం భీమవరం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజు బీఫాం అందించారు. పార్టీ నాయకులు లంకా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

22 నుంచి ఆదికేశవస్వామి బ్రహ్మోత్సవాలు

నరసాపురం, ఏప్రిల్ 19: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన ఆదికేశవ ఎంబెర్‌మన్నార్ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో చాగంటి సురేష్‌నాయుడు తెలిపారు. ఏటా మే నెలలో జరిగే బ్రహ్మోత్సవాలకు అత్యధికంగా తమిళనాడు నుంచి భక్తులు విచ్చేస్తుంటారు. పెరంబదూర్‌లో ఏ సంప్రదాయ పద్ధతిలో ఆదికేశవ స్వామికి ఉత్సవాలు జరుగుతాయో అదే రీతిలో ఇక్కడ కూడా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. 24న శేషవాహనంపై స్వామిని ఊరేగించనున్నారు.

రాజకీయ రైతు సదస్సు

ఆచంట, ఏప్రిల్19: జిల్లా అంతటా ఎన్నికల నేపథ్యంలో నామినేషన్‌ల పర్వం ప్రారంభమైంది. అయితే ఆయా పార్టీల అభ్యర్థులు నామినేషన్‌లు వేసే రోజున పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు వస్తుంటారు. అయితే వచ్చిన వారికి కడుపునిండా భోజనం పెట్టాలి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రైతు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సదస్సు వద్దే నామినేషన్‌లకు వచ్చిన అభ్యర్థులు, కార్యకర్తలు కూడా రైతు అవగాహన సదస్సులో ఏర్పాటు చేసిన భోజనాలు చేస్తున్నారు. ముఖ్యంగా అభ్యర్థులు ఎన్నికల ఖర్చు నుంచి తప్పించుకునేందుకు ఇలాంటివి ఏర్పాటు చేస్తున్నారని వినికిడి.

ప్రత్యర్థుల కరచాలనం



ఎన్నికల కేంద్రంలో ఒకే చాంబర్‌లో పితాని, శ్రీరంగనాథరాజు

ఆచంట, ఏప్రిల్ 19: ఆచంట నుంచి ప్రధాన పార్టీ అభ్యర్థులు అయిన పితాని సత్యనారాయణ , చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఇద్దరు కూడా శుక్రవారం నామినేషన్‌లు వేశారు. ఇద్దరు కూడా ఇంచుమించు ఒకే సమయానికి నామినేషన్‌లు వేశారు. సుమారు గంటకు పైగానే ఎన్నికల కార్యాలయంలో ఉన్నారు. ఒకే చోట కుర్చున్నారు. ఈ సందర్భంగా రంగనాధరాజు పితాని కరచాలనం చేసుకున్నారు.

నామినేషన్‌కు తరలిన కార్యకర్తలు

పెనుగొండ, ఏప్రిల్ 19: ఆచంట నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలి వెళ్లారు. సిద్ధాంతం, కొఠాలపర్రు, దేవ, ములపర్రు, మునమర్రు, చినమల్లం, నడిపూడి, వడలి, వెంకట్రామపురం,దొంగరావిపాలెం గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పెంటపాడు, ఏప్రిల్ 19: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం పెంటపాడులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం అత్తిలికి చెందిన దామిశెట్టి శ్రీనివాసులు (50) తాడేపల్లిగూడెం మిర్చి యార్డ్‌లో పనిచేస్తుంటాడు. శుక్రవారం ఇతను మోటార్ సైకిల్‌పై తాడేపల్లిగూడెం పనికి వస్తుండగా పెంటపాడు గేటు సెంటర్ సమీపంలో టాటా ఏస్ వాహనం ఢీకొంది. 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు దామిశెట్టి గోపాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ బాబూరావు తెలిపారు.

కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 19: తాడేపల్లిగూడెం శివారు లక్కీ రోడ్ లైన్స్ సమీపంలోని ఏలూరు కాల్వలో 40-50 ఏళ్ల మధ్య వయస్సు గల పురుషుడి మృతదేహం లభ్యమైనట్టు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతుడి ఒంటిపై తెలుపురంగు నిలువు చారల చొక్కా, నల్ల షార్ట్, నలుపు మొలతాడు ఉన్నట్టు వివరించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96611కు సమాచారం అందించాలని కోరారు.

మోదీ రాష్ట్రానికి చేసింది శూన్యం-సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బలరామ్

ఆకివీడు, ఏప్రిల్ 19: బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ అన్నారు. శుక్రవారం ఆర్యవైశ్య కళ్యాణ మందిరంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. వైసీపీ, టీడీపీ, జనసేనలు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారన్నారు.

నిమ్మలను కలిసిన వర్మ



పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 19: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలకొల్లు అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన నిమ్మల రామానాయుడును శుక్రవారం కూటమి నరసాపురం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి కలిశారు. రామానాయుడుకి వీరు పుష్పగుచ్ఛాలు అందచేసి భారీ మెజార్టీతో విజయం సాధించాలంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, జనసేన రాష్ట్ర ప్రచార విభాగం కన్వీనర్ బన్నీ వాసు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉన్నమట్ల కబర్ది తదితరులు పాల్గొన్నారు.

చేయితడిపి బల నిరూపణ!

భీమవరం రూరల్, ఏప్రిల్ 19 : మాకు బలముంది.. అనే ప్రచార నిరూపణకు అధికార పార్టీ నేతలు చేయితడిపి మరీ ప్రచారం చేసుకుంటున్నారు. మొన్న సీఎం జగన్ సదస్సులకు మహిళలకు సైతం తాయిలాల ముట్టజెప్పి మరీ జనసమీకరణ చేయాల్సి వచ్చింది. నేడు నామినేషన్‌ల దాఖలు ర్యాలీలకు విందు, చేయితడిపే కార్యక్రమాలపై అధికార పార్టీల నాయకులు మక్కువ చూపుతున్నారు. పార్టీ కోసం వచ్చే వారితో పాటు మరి కొందరిని ఇలా ప్రచారంలోకి దింపడం బలప్రచారంగా ఉంటుందనే ఆలోచనగా మారింది. గతంలో ఇంతలా ఉండేది కాదని అనుభవ రాజకీయ నాయకులు చెబుతున్నారు.

అవగాహనతోనే వ్యాధులు దూరం

పెదవేగి, ఏప్రిల్ 19 : దోమల వ్యాప్తితోనే సకల వ్యాదులు ప్రబలుతా యని, అవగాహనతోనే వ్యాధులను దూరం చేసుకోవచ్చని మలేరియా సహాయ అధికారి జె.గోవిందరావు అన్నారు. పినకడిమిలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో పర్యటించి, మహిళలకు పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటకాల్లో అత్యంత ప్రమాదకరమైనది దోమ అన్నారు. మనరక్తాన్ని తాగి, మనకు ప్రాణాంతకమైన వ్యాధులను సంక్రమింపచేస్తుందని ఆయన చెప్పారు. దోమల నిర్మూలన ఒక సామాజిక బాధ్యతగా తీసుకుని, ప్రతిఒక్కరూ దోమల నిర్మూలనపై ప్రత్యేకదృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఇంటి ఆవరణలో తొట్టెలు, డ్రమ్ములు, పూలకుండీలు, వాడి పడేసిన టైర్లు, ప్లాస్టిక్ గ్లాసులు వంటి వాటిల్లో దోమలు పెరుగుతాయన్నారు. వారానికోసారైనా తొట్టెలను శుభ్రపర్చాలని, వాడని వస్తువులను బోర్లించాలని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రియదర్శిని, హెల్త్ అసిస్టెంట్లు వి.కిశోర్, ఎం.శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త వెంకటేశ్వరమ్మ, ఆశాకార్యకర్త పద్మ పాల్గొన్నారు.

శ్రీవారి రథోత్సవం



పెనుమంట్ర, ఏప్రిల్ 19 : భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక తీర్థ మహోత్సవంలో భాగంగా శుక్రవారం స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు కోలాట నృత్యాలు డప్పు వాయిద్యాలు విచిత్ర వేషధారణ నడుమ స్వామి వారు దివి నుంచి భూమికి దిగివచ్చినట్టుగా స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవంలో ఆబోతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పూర్వం ఈ ప్రాంతంలో సంచరించే ఆబోతు మరణించడంతో ఆలయ ప్రాంతంలోనే ఖననం చేశారు ఈ ప్రాంతంలోనే వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించి దేదీప్యమానంగా భక్తులతో కొరవబడుతుంది. కోరిన కోర్కెలు తీర్చే శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రతి ఏడాది కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించి తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా భారీ బాణసంచా కాల్పులు నిర్వహించారు.

15 నుంచి అతిరాత్ర మహాయాగం



మహాయాగం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, ఏప్రిల్ 19 : డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో వచ్చేనెల 15 నుంచి 25వ తేదీ వరకు శ్రీఉమా రామలింగేశ్వర ట్రస్టు (నెలమూరు) ఆధ్వర్యంలో రాజశ్యామల, దశమహా విద్య సహిత అతిరాత్ర మహాయగం నిర్వహిస్తున్నట్లు నెలమూరు శ్రీ ఉమా రామలింగేశ్వర వేద పాఠశాల నిర్వాహకులు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ, ప్రవచన కర్త, సేవ్ టెంపుల్ చైర్మన్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో అతిరాత్ర మహాయగం బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి



చిత్రభానును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం రూరల్, ఏప్రిల్ 19 : విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు సామాజిక, న్యాయపరమైన అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని న్యాయవాది విద్యావేత్త, డా.ఎం చిత్రభాను సూచించారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో యాంప్లిఫైయింగ్ ఉమెన్ వాయిస్ ఇన్‌ది పర్సూట్ ఆఫ్ జస్టిస్ అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమానికి ఇంటర్నేషనల్ కమిటీ ఛైర్‌పర్సన్ డా.బిహెచ్‌విఎస్ లక్ష్మీ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా డా.చిత్రభాను మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులేనని ఒక్కోసారి న్యాయం జరగకపోయినా అమ్మాయిలందరూ ఎప్పుడూ జాగృతితో ఉండాలని ఆమె సూచించారు. ప్రభుత్వాలు ఫోక్సో చట్టం, నిర్భయ చట్టం, దిశా యాప్ మహిళలు సద్వినియోగం చేసుకొని తమకు రక్షణగా ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. డా.బిహెచ్‌విఎస్ లక్ష్మీ మాట్లాడుతూ మహిలల్లో చైతన్యం కోసం ఇటువంటి సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం చిత్రభానును సన్మానించారు.





భీమవరంలో చలివేంద్రం ప్రారంభిస్తున్న గుండె వైద్యులు వెంకటేశ్వరరావు, పర్రిపాటి శ్రీను.. పాలకోడేరులో చలివేంద్రాన్ని ప్రారంభించిన పెద్దిరాజు, స్వామిచంద్రం

చలివేంద్రాలు ప్రారంభం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 19: భీమవరం జేపీ రోడ్డులో ఆదిత్య డిగ్రీ కళాశాల, వింగ్స్ ఆఫ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సహకారంతో చలి వేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గుండె వైద్యులు వెంకటేశ్వరరావు, వాసవి జాగృతి వీజెఎఫ్ ఇంటర్నేషనల్ క్లబ్ పట్టణ అధ్యక్షుడు పర్రిపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: పాలకోడేరు గ్రామం గౌడ్‌సెంటర్‌లో పురాణదిమ్మ వద్ద శుక్రవారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. కీర్తి శేషులు తొంటా చిట్టియ్య జ్ఞాపకార్థం కుమారులు పెద్దిరాజు, స్వామి, చంద్రం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిర్వహణకు దాతలు సహకరించాలని కోరారు.





పాలకొల్లు, ఆకివీడులలో ఫైర్ అధికారుల విన్యాసాలు

అగ్నితో అజాగ్రత్త వద్దు

ఫైర్ అధికారుల అవగాహన విన్యాసాలు

ఆకివీడు, ఏప్రిల్ 19: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని అగ్నిమాపకశాఖాధికారి నాగేశ్వరరావు అన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు, సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందికి దుకాణాలు, గొడౌన్‌లు తదితర చోట్ల అగ్ని ప్రమాదాలు జరిగితే ఏవిధంగా నియంత్రించాలో శుక్రవారం డెమో చేసి చూపించారు. ప్రతి ఒక్కరూ అగ్నితో నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వ్యవహరించి నష్టాన్ని చవిచూడరాదన్నారు.

పాలకొల్లు అర్బన్: ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరులను ఏవిధంగా కాపాడాలి, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని రక్షించడం అన్న అంశాలపై ప్రదర్శన పూర్వకంగా అగాహన కలిగించారు. శుక్రవారం సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వెవీ జానకి రామ్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలో ఫైర్‌కారుతో ర్యాలీ చేసి, ఓ ప్రైవేటు ఆసుపత్రికి చేరుకుని ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బందికి, రోగులకు, రోగుల బంధువులకు అవగాహన కలిగించారు. షార్టు సర్క్యూట్ కావడం, అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఏవిధంగా కాలిన రోగులను కాపాడాలి, మంటలను ఏ విధంగా అదుపు చేయాలని వంటి అంశాలపై ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో సత్య ఆసుపత్రి డాక్టర్ కె.సత్యేంద్ర కమార్, సిబ్బంది, సుఖీభవ ఆసుపత్రి డాక్టర్ సీహెచ్ సురేష్ బాబు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పట్టణంలోని వరలక్ష్మి, రుస్తుంబాద ఏరియా ఆస్పత్రిల్లో శుక్రవారం అగ్ని ప్రమాదాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అస్పత్రిలో ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ విధంగా బయటపడాలన్న దానిపై కరపత్రాలు అందించారు. డెమోతో ఫైర్ అధికారి భాస్కర్‌రాం వివరించారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి జీవీ రామారావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు, ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.